





# నిజామాబాద్ జిల్లాలో అడ్డూఅదుపు లేని 'కల్తీ కల్లు' దందా!

## ఆల్ప్రాజోలం, క్లోరల్ హైడ్రేట్ కలిపి ప్రాణాలతో చెలగాటం..

## ఆసుపత్రుల పాలవుతున్న శ్రమజీవులు!

విజేత,నిజామాబాద్ క్రైమ్ బ్యూరో :

నిజామాబాద్ జిల్లాలో కల్తీ కల్లు మాఫియా మళ్లీ కోరలు చాస్తోంది. తాటి, ఈత చెట్ల నుంచి వచ్చే సహజ సిద్ధమైన కల్లుకు బదులు, రసాయనాలే ముడిసరుకుగా మార్చుకుని అక్రమార్కులు కోట్లు గడిస్తున్నారు. జిల్లాలోని పలు మండలాల్లో కల్తీ కల్లు సేవించి కూలీలు, సామాన్య ప్రజలు వింత వ్యాధులకు గురవుతున్నారు. అధికారుల తనిఖీలు తూతూమంత్రంగా సాగుతుండటంతో ఈ దందా విచ్చలవిడిగా సాగుతోంది.

@ ఏమిటీ రసాయనాల మాయ?.....

గతంలో కల్లులో మత్తు కోసం క్లోరల్ హైడ్రేట్ వాడేవారు. అయితే ఇప్పుడు దాని స్థానంలో అత్యంత ప్రమాదకరమైన ఆల్ప్రాజోలం (Alprazolam) వంటి నార్కోటిక్ డ్రగ్స్‌ను వినియోగిస్తున్నారు. కేవలం కొద్దిపాటి సహజ కల్లులో పదుల రెట్ల నీళ్లు కలిపి, దానికి చిక్కదనం కోసం కుంకుడుకాయ రసం, మత్తు కోసం కెమికల్స్ కలుపుతున్నట్లు పోలీసుల దాడుల్లో వెల్లడవుతోంది.ప్రాణాంతకమైన ఆరోగ్యం ఈ కల్తీ కల్లు తాగిన వారిలో మెదడుపై ప్రభావం పడి పిచ్చిగా ప్రవర్తించడం, కాళ్లు చేతులు వంకర్లు తిరగడం, కిడ్నీలు దెబ్బతినడం వంటి లక్షణాలు కనిపిస్తున్నాయి.డిపోలే కేంద్రాలు నగర శివారులోని కల్లు డిపోల నుంచే ఈ కల్తీ కల్లు మండలాలకు సరఫరా అవుతున్నట్లు సమాచారం.

@ తనిఖీల లోపం.... ఎక్సైజ్ శాఖ అధికారులు కేవలం నామమాత్రపు శాంపిళ్లు సేకరించి చేతులు దులుపుకుంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

@ వైద్యుల హెచ్చరిక ..."కల్తీ కల్లులో వాడే ఆల్ప్రాజోలం వల్ల కేంద్ర నాడీ వ్యవస్థ దెబ్బతింటుంది. దీనికి బానిసలైన వారు క్రమంగా మతిస్థిమితం కోల్పోతారు. దీర్ఘకాలికంగా తాగితే మరణం తప్పదు." – జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు.

### మృత్యువుతో వ్యాపారం



నార్కోటిక్ బృందం రంగంలోకి..

ఇటీవలే నిజామాబాద్ జిల్లా కేంద్రంతో పాటు మోపాల్ వంటి మండలాల్లో నార్కోటిక్ బృందాలు దాడులు నిర్వహించి కిలోల కొద్దీ ఆల్ప్రాజోలం సీజ్ చేశాయి. అయినా సరే, తెరవెనుక రాజకీయ అండదండలతో విక్రయాలు ఆగడం లేదన్నది బహిరంగ రహస్యం.ప్రభుత్వం తక్షణమే స్పందించి కల్తీ కల్లు దందాను అరికట్టకపోతే ఉమ్మడి జిల్లాలో మరిన్ని ప్రాణాలు గాలిలో కలిసే ప్రమాదం ఉంది.



# కామారెడ్డిలో మట్టి స్నానం..

విజేత,కామారెడ్డి :కామారెడ్డి జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్, భారత్ స్వాభిమాన్ సంయుక్త ఆధ్వర్యంలో కామారెడ్డి పెద్ద చెరువు వద్ద భారీ స్థాయిలో మట్టి స్నానాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వినూత్న కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుండి సుమారు 130 మంది యోగా సాధకులు, ప్రకృతి ప్రేమికులు పాల్గొన్నారు.



# వారంలో రోజుల్లో 230 డ్రంకన్ డ్రైవ్ కేసులు – 21,60,000 జరిమానా విధించిన కోర్టులు

## పోలీస్ కమిషనర్ సాయిచైతన్య వెల్లడి

విజేత, నిజామాబాద్ ప్రతినిధి : జిల్లా వ్యాప్తంగా గడిచిన వారంలో రోజుల్లో 230 డ్రంకన్ డ్రైవ్ కేసులు నమోదు అయినట్లు పోలీస్ కమిషనర్ సాయి చైతన్య వెల్లడించారు.నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ సమీపాలలో వారి వారి పోలీస్ స్టేషన్ సరిహద్దులలో వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ నెల 9 నుండి 14వ తేదీ వరకు వాహన తనిఖీలు నిర్వహించగా ఇందులో మొత్తం 230 కేసుల నమోదు చేశారు వీరిని సంబంధిత కోర్టులలో హాజరుపరచగా రూ.21,60,000 జరిమానా విధించడం జరిగిందని సీపీ తెలిపారు. వీరిలో 14 మందికి వారం రోజుల పాటు జైలు శిక్ష విధించడం జరిగిందన్నారు. ప్రజలు మద్యం సేవించి వాహనాలు నడపరాదని, వాహనాదారులు వాహనానికి సంబంధించినటువంటి పత్రాలు సక్రమంగా తమ వద్ద ఉంచుకోగలరన్నారు.



# అమ్మానగర్ అభివృద్ధికి కృషి చేస్తా

## నగర మేయర్ ఉమారాణి

విజేత, నిజామాబాద్ ప్రతినిధి : అమ్మానగర్ లో నెలకొన్న సమస్యలను పరిష్కరించి, అమ్మ నగర్ అభివృద్ధి కోసం కృషి చేస్తా అని నిజామాబాద్ మేయర్ ఉమారాణి రమేష్ అన్నారు. ఆదివారం అమ్మ నగర్ కమిటీ ఆధ్వర్యంలో అమ్మా నగర్ ఆఫీస్ లో నూతన మేయర్ ఉమారాణి ని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు పలు సమస్యలను మేయర్ దృష్టికి తీసుకువస్తూ వినతి పత్రం అందజేశారు. అనంతరం నూతన కార్పొరేటర్ ప్రమోద్, పులగం వైష్ణవి సుధా, బొబ్బిలి సువర్ణ వేణు గోపాల్, పంచ రెడ్డి లలిత చరణ్, న్యాలం మధు లను కూడా ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అమ్మ నగర్ హౌస్ హోల్డర్స్ అసోసియేషన్ అధ్యక్షులు యెండల కిషన్, ప్రధాన కార్యదర్శి బొబ్బిలి కిషన్, అధ్యక్షులు రెంజర్ల నరేష్, ఉపాధ్యక్షులు మాడవేడి వినోద్ కుమార్, కోశాధికారి మహేందర్, ఎర్రన్న, శంకర్, మధుసూదన్, ప్రవీణ్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



# జల్సాల కోసం ఆటో చోరి

విజేత, నిజామాబాద్ ప్రతినిధి : మద్యానికి బానిసై దొంగతనాలు చేస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్టు నార్త్ రూరల్ సిఐ శ్రీనివాస్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం ఈ నెల 13న జిన్నా నర్సింలు అనే వ్యక్తి తన ఆటో ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించారని నగరంలోని 5వ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా దొంగతనం చేసిన వ్యక్తిని గుర్తించారు. ఈ క్రమంలో షేక్ నయిమ్ అనే వ్యక్తి మద్యానికి అలవాటు పడి ఎటువంటి పని చేయకుండా చిల్లర దొంగతనాలకు అలవాటు పడి జీవితం కొనసాగిస్తూ ఉండేవాడని తెలిపారు. తాగడానికి డబ్బులు లేకపోవడంతో నిజామాబాద్ ఆర్.ఆర్ చౌరస్తా వద్ద గల ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ వద్ద పార్క్ చేసిన ఆటోని దొంగతనం చేసి నాందేడ్ లో విక్రయించడానికి వెళ్తుండగా పక్కా సమాచారంతో పోలీసులు అర్సపల్లి బైపాస్ వద్ద నయిమ్ ని ఆటో తో సహా పట్టుకుని అదుపులోకి తీసుకున్నారు. నేరం చేసిన నయిమ్ ని అరెస్ట్ చేసి రిమాండ్ కు పంపించారు. కేసు చేదించిన ఎస్ ఐ శ్రీనివాస్,ఐడి పార్టీ సిబ్బంది,5వ టౌన్ పోలీసు సిబ్బందిని సిఐ అభినందించారు.

# ప్రాంతీయ ఘర్షణ నుంచి ప్రపంచ సంక్షోభం దిశగా ఇరాన్–ఇజ్రాయెల్ పోరు

(సి.హెచ్.ప్రతాప్)

మధ్యప్రాచ్య ప్రాంతం గత కొన్ని దశాబ్దాలుగా అంతర్జాతీయ రాజకీయాల్లో తీవ్ర ఉద్రిక్తతలకు నిలయంగా మారింది. ముఖ్యంగా ఇరాన్, ఇజ్రాయెల్ దేశాల మధ్య అగాధం పెరుగుతుండటం ప్రపంచ దేశాలను కలవరపెడుతోంది. ఒకప్పుడు పరోక్ష యుద్ధాలకు పరిమితమైన ఈ వైరం ఇప్పుడు ప్రత్యక్ష సైనిక దాడుల స్థాయికి చేరుకుంది. ఈ పరిణామం కేవలం రెండు దేశాల మధ్య ఘర్షణగానే కాకుండా ప్రపంచ గతిని మార్చే భారీ సంక్షోభంగా రూపుదిద్దుకుంటోంది. ఈ రెండు దేశాల మధ్య విభేదాలకు చారిత్రక, రాజకీయ, భద్రతాపరమైన కారణాలు అనేకం ఉన్నాయి.

ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య వైషమ్యాలకు ప్రధాన కారణం ఆధిపత్య పోరు. ఇజ్రాయెల్ తన ఉనికికే ఇరాన్ ముప్పుగా పరిగణిస్తోంది. ఇరాన్ అణు కార్యక్రమాలు చేపడుతుండటం ఇజ్రాయెల్ భద్రతా ఆందోళనలను మరింత పెంచింది. ఇరాన్ అణ్వాయుధాలను సమకూర్చుకుంటే అది తమ మనుగడకే ప్రమాదమని ఇజ్రాయెల్ భావిస్తోంది. మరోవైపు ఇరాన్ సైతం ఇజ్రాయెల్‌ను మధ్యప్రాచ్యంలో అస్థిరతకు మూలకారణంగా నిరంతరం విమర్శిస్తోంది. సిద్ధాంతపరమైన విభేదాలు, ప్రాంతీయ శక్తిగా ఎదగాలనే ఆకాంక్షలు ఈ దేశాల మధ్య శత్రుత్వాన్ని తీవ్రతరం చేశాయి.ఇటీవలి కాలంలో ఇరు దేశాలు ఒకరిపై ఒకరు నేరుగా క్షిపణులు, డ్రోన్లతో దాడులు చేసుకోవడం యుద్ధ మేఘాలను కమ్మేలా చేసింది. ఈ ఘర్షణలో ఇరాన్ మద్దతు ఉన్న వివిధ సాయుధ సమూహాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. లెబనాన్‌లోని హిజ్బొల్లా వంటి సంస్థలు ఇరాన్ తరపున పోరాడుతుండటంతో ఈ వివాదం బహుముఖ యుద్ధంగా మారుతోంది. ఇజ్రాయెల్ సరిహద్దుల్లో నిరంతరం కొనసాగుతున్న దాడులు, ప్రతిదాడులు ఈ ప్రాంతాన్ని ఒక అగ్నిగుండంగా మార్చాయి. మధ్యప్రాచ్యంలో చోటుచేసుకుంటున్న ఈ పరిణామాలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయి. ప్రపంచ చమురు నిల్వలకు ఈ ప్రాంతం కీలకమైన కేంద్రం కావడంతో ఇక్కడి అస్థిరత చమురు సరఫరా వ్యవస్థను దెబ్బతీస్తోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు ఆకాశాన్ని తాకడం వల్ల అన్ని దేశాల్లో ద్రవ్యోల్బణం పెరిగే ప్రమాదం ఉంది. రవాణా మార్గాలపై దాడులు జరగడం వల్ల ప్రపంచ వాణిజ్యం స్తంభించిపోయే పరిస్థితులు కనిపిస్తున్నాయి.



.అంతర్జాతీయ రాజకీయ సమీకరణాలు సైతం ఈ ఘర్షణతో వేగంగా మారుతున్నాయి. అమెరికా వంటి అగ్రరాజ్యాలు ఇజ్రాయెల్‌కు అండగా నిలుస్తుండగా కొన్ని దేశాలు ఇరాన్ వైపు మొగ్గు చూపుతున్నాయి. ఈ విధంగా ప్రపంచ దేశాలు రెండు వర్గాలుగా విడిపోవడం వల్ల మరొక ప్రపంచ యుద్ధం సంభవిస్తుందేమోనన్న భయం వ్యక్తమవుతోంది. దౌత్యపరమైన చర్చలు విఫలమవ్వడం, పరస్పర కక్షసాధింపు చర్యలు పెరగడం వల్ల పరిస్థితి క్లిష్టంగా మారుతోంది.

ప్రస్తుత తరుణంలో అంతర్జాతీయ సమాజం మౌనం వీడి బాధ్యతా యుతంగా వ్యవహరించాలి. ఐక్యరాజ్యసమితి వంటి సంస్థలు కేవలం విమర్శలకే పరిమితం కాకుండా ఉద్రిక్తతలను తగ్గించే దిశగా బలమైన చర్యలు తీసుకోవాలి. యుద్ధం వల్ల కలిగే వినాశనం కంటే శాంతి వల్ల కలిగే స్థిరత్వం ఎంతో విలువైనదని గుర్తించాలి. చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవడమే ఏకైక మార్గం. ఆయుధాల మోత కంటే శాంతి వచనాలు ప్రపంచానికి నేడు అత్యవసరం.

మధ్యప్రాచ్యంలో శాంతి నెలకొనడం అనేది ప్రపంచ సుస్థిరతకు ప్రాణాధారం. ఇరాన్–ఇజ్రాయెల్ మధ్య రాజుకున్న ఈ మంటలను సకాలంలో ఆర్పకపోతే అవి ప్రపంచవ్యాప్తంగా పెను విపత్తుకు దారితీస్తాయి. ప్రపంచ నాయకత్వం తక్షణమే స్పందించి దౌత్య మార్గాల ద్వారా ఉద్రిక్తతలను తగ్గించి ఒక శాశ్వత పరిష్కారాన్ని కనుగొనాలి. యుద్ధం ఎవరికీ విజయాన్ని చేకూర్చదు అది కేవలం విధ్వంసాన్ని మాత్రమే మిగులుస్తుంది.



## ఫీజు పోరు దీక్షకు తరలిన బీసీ సంక్షేమ సంఘం నాయకులు

విజేత, నిజామాబాద్ ప్రతినిధి : ఫీజు రియంబర్స్ మెంట్ బకాయిలను విడుదల చేయాలనే డిమాండ్ తో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ పిలుపుతో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్ లోని ఇందిరాపార్క్ వద్ద ధర్నా చౌక్ లో నిర్వహిస్తున్న "ఫీజు పోరు దీక్షకు బీసీ సంక్షేమ సంఘం జిల్లా నాయకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నరాల సుధాకర్ మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్ మెంట్ స్కాలర్ షిప్ డబ్బులు విడుదల కాకపోవడంతో బడుగు బలహీన వర్గాల విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను విడుదల చేసి నిరుపేద విద్యార్థులను ఆదుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నరాల సుధాకర్ తో పాటు దర్శనం దేవేందర్, కొయ్యాడ శంకర్, బగ్గలి అజయ్, చంద్రకాంత్, సాయి బసవ, దయానంద్, సందేశ్, సందీప్, నరేష్, శివ, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు





విజేత,నిజాంసాగర్ : కామారెడ్డి జిల్లా మద్నూర్ మండల కేంద్రంలో తెలంగాణ ప్రభుత్వం ముస్లిం సోదరుల కోసం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమంలో జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని, ఇఫ్తార్ విందులో ఉపవాస విరమణ చేయించారుఅనంతరం అందరితో కలిసి భోజనం చేసి రంజాన్ పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు మాట్లాడుతూ రంజాన్ మాసం సౌహార్దం, సోదరభావం, పరస్పర గౌరవాన్ని పెంపొందించే పవిత్రమైన నెల అని తెలిపారు సమాజంలో శాంతి, ఐక్యత నెలకొనాలని ఆకాంక్షిస్తూ ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులు మరియు ముస్లిం సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

## జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో భారీ చేరికలు

### పోచారం తండా గ్రామ పంచాయతీ భవనం ప్రారంభం





విజేత,నిజాంసాగర్ : కామారెడ్డి జిల్లా పెద్ద కొడప్గల్ మండలంలోని పోచారం తండా గ్రామ పంచాయతీ సర్పంచ్ కోల సీతా బాయి వార్డ్ మెంబర్స్ మరియు పలువురు గ్రామస్థులు జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు మాట్లాడుతూ గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించడానికి కృషి చేస్తానని తెలిపారు పోచారం తండా అభివృద్ధి కోసం రహదారులు, తాగునీటి సదుపాయాలు, విద్యుత్, డ్రైనేజీ వ్యవస్థలు వంటి మౌలిక వసతులను మరింత మెరుగుపరచడానికి చర్యలు తీసుకుంటామని అన్నారు గ్రామంలోని యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంపై కూడా ప్రత్యేక దృష్టి సారిస్తామని పేర్కొన్నారు అలాగే గ్రామ ప్రజల సహకారంతో ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసి, తండాను అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్తామని ఎమ్మెల్యే తెలిపారుఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు మరియు ప్రజలు పాల్గొన్నారు.

## మమ్మ నగర్ మండలం లో ఎమ్మెల్యే తోట లక్ష్మి కాంతారావు ఆధ్వర్యంలో

## కాంగ్రెస్ పార్టీలో భారీ చేరికలు





విజేత,నిజాంసాగర్ : కామారెడ్డి జిల్లా మహమ్మద్ నగర్ మండల కేంద్రంలో జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో భారీగా చేరికలు మోతీ రామ గౌడ్ బుడగజంగం నాయకుడు కాశీరామ్ మరియు సింగీతం గ్రామానికి చెందిన యువ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, అభివృద్ధి పనుల పట్ల ఆకర్షితులై ఇతర పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరుతుండటం ఎమ్మెల్యే స్వాగతిస్తూ హర్షం వ్యక్తం చేశారు రాబోయే రోజుల్లో జుక్కల్ నియోజకవర్గ అభివృద్ధి కోసం అందరూ కలిసి పని చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు కాంగ్రెస్ పార్టీ మరింత బలపడేందుకు ప్రతీ కార్యకర్త కృషి చేయాలని ఆయన సూచించారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

## ప్రజా ఐక్యత గీతం

పర్వత శిఖరములపై పలికిన కవితా నాదమది
పృథ్వీ గర్భమంతటా పరిమళించి విరజిల్లె;
భాషల గోడలన్నియు భగ్నమగునని బోధించి
భావాల సేతువై మానవ హృదయములను కలిపె...
కులమత భేదముల కలుషిత చీకటిలో
కరుణా కాంతిరేఖలై కవిత వెలుగె;
విభేద వలయముల విరిచి సమత్వ మార్గమున
సామరస్య సుగంధమై సమాజమున పరచె...
పేదవాని నిశ్వాసము, ధనవాని గర్వగీతము
ఒకే రాగమై కలిసిన క్షణమున
సమానత్వ సత్యమై సమాజ గర్భమందు
స్నేహ స్వరమై సర్వలోకమున మార్మోగె...
సరిహద్దు రేఖలతో భూమిని చీల్చిన చేతులకన్నా
స్నేహసూత్రమే శాశ్వతమని కాలమే చెప్తుంది;
మనసుల నదులన్నియు ఒకే సముద్రమై చేరగా
మానవత్వమే జగతికి మహాసంగీతమవుతుంది...
కావున కవిత కేవలం పదాల అలంకారముకాదు—
ప్రజల హృదయాలను కలిపే పవిత్ర జ్యోతి అది;
ప్రపంచ కవితా స్వరమై మార్మోగిన వేళ
ప్రజల ఐక్యత రాగమే భూమికి శాశ్వత
గీతమవుతుంది.



రచన: మంజుల పత్తిపాటి
యాదాద్రి భువనగిరి జిల్లా
తెలంగాణ రాష్ట్రం
చరవాణి 9347042218

# అమ్మకానికి గ్రేహౌండ్స్ భూములు!

**– ఆ విభాగాన్నే మూసివేసే దిశగా ప్రతిపాదనలు.**
**– గ్రేహౌండ్స్ అధీనంలో 550 ఎకరాల భూమి.**
**– వీటిని అమ్మే యోచనలో రాష్ట్ర ప్రభుత్వం**
**– 20వేల కోట్లకుపైగా నిధులు వస్తాయని అంచనా**

విజేత, కామారెడ్డి:
నక్సలైట్ల ఏరివేతలో అత్యంత కీలకపాత్ర పోషించిన గ్రేహౌండ్స్ విభాగాన్ని మూసివేయాలని ప్రభుత్వం భావిస్తున్నదా? గ్రౌహౌండ్స్ ఆధీనంలో ఉన్న 550 ఎకరాల భూములను అమ్మకానికి పెట్టాలని నిర్ణయించిందా? ఈ ప్రశ్నలకు అవును అనే సమాధానమే వస్తున్నది. దేశంలో ఈ నెలాఖరుకు (మార్చి 31 డెడ్‌లైన్) నాటికి మావోయిస్టులను సంపూర్ణంగా నిర్మూలించాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్న కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే ఆ లక్ష్యాన్ని దాదాపు పూర్తి చేసింది. ఆపరేషన్ కగార్ నేపథ్యంలో పలువురు కీలక నేతలు ఎన్‌కౌంటర్లలో చనిపోవడం, మరి కొందరు అగ్రనేతలు లొంగిపోవడంతో మావోయిస్టు పార్టీ దాదాపు ఉనికి కోల్పోయే స్థితికి చేరుకున్నది. ఈ నేపథ్యంలో మావోయిస్టుల కదలికలను కట్టడి చేసేందుకు ఏర్పాటు చేసిన గ్రేహౌండ్స్ దళాలతో పనిలేదని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నది. గ్రేహౌండ్స్‌లో పనిచేస్తున్న వారిని పోలీసు శాఖలోని ఇతర విభాగాల్లోకి బదిలీ చేయాలని, గ్రేహౌండ్స్‌కు కేటాయించిన భూములను ఇతర అవసరాలకు వినియోగించాలని ప్రభుత్వం యోచిస్తున్నట్టు వార్తలొస్తున్నాయి.



ఆ భూములను అమ్మేస్తే ప్రభుత్వానికి భారీ మొత్తంలో నిధులు అందుబాటులోకి వస్తాయని భావిస్తున్న ప్రభుత్వం.. ఆ మేరకు కార్యాచరణ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించినట్టు తెలిసింది. దీంతో రంగంలోకి దిగిన అధికారులు.. గ్రేహౌండ్స్‌కు రాష్ట్రంలో ఎక్కడెక్కడ భూములున్నాయి? వాటిలో విలువైన భూములు ఎక్కడ ఉన్నాయనే అంశంపై దృష్టిపెట్టారు. గ్రేహౌండ్స్‌కు హైదరాబాద్ చుట్టుపక్కల అత్యంత ఖరీదైన ప్రాంతాల్లో మొత్తం 550 ఎకరాల భూమి ఉన్నదని అధికారులు గుర్తించారు. ఈ భూముల విలువ ఇప్పుడు కొన్నివేల కోట్ల రూపాయలు ఉంటుందని అధికారులు చెప్తున్నారు. సగటున రూ.50 కోట్లకు ఎకరం చొప్పున అమ్మినా రూ.20 వేల కోట్లకుపైగా ప్రభుత్వానికి వస్తుందని అంచనా వేస్తున్నారు. ఇందులో కొంత భూమిని ప్రభుత్వం ఉంచుకున్నా, కనీసం 500 ఎకరాల భూమిని సులువుగా అమ్ముకోవడానికి అనుకూలంగా ఉన్నదని అధికారులు చెప్తున్నారు. ఈ లెక్కన రూ.20 వేల కోట్లు సమకూరుతాయని భావిస్తున్నారు. ఈ మొత్తం ప్రక్రియను వచ్చే ఆర్థిక సంవత్సరంలో మొదలుపెట్టాలని, ఒక ఏడాదిలోపు మొత్తం అమ్మేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు తెలుస్తున్నది.

**@– 1989లో గ్రేహౌండ్స్ ఆవిర్భావం**

ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి పీపుల్స్‌వార్ ప్రస్తుత మావోయిస్టుల ప్రాబల్యాన్ని అడ్డుకొనేందుకు ఆనాటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు చొరవతో 1989లో గ్రౌహౌండ్స్ దళాన్ని ఏర్పాటు చేశారు. సీనియర్ ఐపీఎస్ అధికారి కేఎస్ వ్యాస్ గ్రేహౌండ్స్ విభాగానికి రూపకల్పన చేశారు. గ్రేహౌండ్స్ దళాలకు శిక్షణ ఇచ్చేందుకు హైదరాబాద్ శివారులోని ప్రేమావతిపేటలో సుమారు 150 ఎకరాల్లో శిక్షణ కేంద్రం ఏర్పాటుచేశారు. దీంతోపాటు మరో శిక్షణ కేంద్రం, పరిపాలనా కేంద్రం మంచిరేవులలో సుమారు 400 ఎకరాల్లో విస్తరించి ఉన్నది. నిరంతరం ఇక్కడ పోలీసులకు శిక్షణ కార్యక్రమాలు జరుగుతూనే ఉంటాయి. 1989 నుంచి ఇప్పటివరకు వేలాది మంది పోలీసులు గ్రేహౌండ్స్‌లో శిక్షణ పొందారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిస్సా, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో జరిగిన అనేక కూంబింగ్ ఆపరేషన్లలో గ్రేహౌండ్స్ దళాలు పాల్గొన్నాయి.

**@– మావోయిస్టులు లేనందున మూసేద్దాం!**

కేంద్ర ప్రభుత్వం నిర్దేశించుకున్న డెడ్‌లైన్ ప్రకారం దేశవ్యాప్తంగా మావోయిస్టుల నిర్మూలన కార్యక్రమం దాదాపు విజయవంతమైన నేపథ్యంలో ఇంకా గ్రేహౌండ్స్‌తో పని ఏమిటని పోలీసు అధికారులను రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు ప్రశ్నించారని తెలిసింది. గ్రేహౌండ్స్ పార్టీలు ఇప్పుడు పెద్దగా కూంబింగ్ కూడా చేయడంలేదని, ఇక వీరితో పని ఉండదని, మొత్తానికి మొత్తం గ్రేహౌండ్స్ విభాగాన్ని ఎత్తేయాలని ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించిందని సమాచారం. ఇప్పుడు సుమారు పన్నెండు వందల మందికిపైగా ఉన్న సిబ్బందిని ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్, ఏఆర్, సివిల్ తదితర విభాగాలకు పంపించివేస్తున్నారు. చాలామంది కానిస్టేబుళ్లు, ఇతర అధికారులను పోలీసు శాఖలోని వివిధ విభాగాల నుంచి గ్రేహౌండ్స్‌కు గతంలో పంపించారు. అలాంటివారిని వారివారి మాతృవిభాగాలకు పంపించివేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

**@– విభాగాన్ని మూసేయొద్దు**

గతంలో గ్రేహౌండ్స్‌లో పనిచేసిన అధికారులు, సిబ్బంది మాత్రం గ్రేహౌండ్స్‌ను పూర్తిగా మూసివేయొద్దని ప్రభుత్వానికి సూచిస్తున్నారు. ఎంతో ప్రతిష్ఠాత్మకంగా గ్రేహౌండ్స్‌ను పోలీసు అధికారులు తీర్చిదిద్దారని, దేశంలోనే తెలంగాణ గ్రేహౌండ్స్‌కు మంచి పేరున్నదని, అలాంటిది ఇప్పుడు మావోయిస్టులు లేరన్న పేరుతో ఇప్పటికిప్పుడు తీసివేయడం తగదని చెప్తున్నారు. ఇదే గ్రేహౌండ్స్‌ను మరో విధంగా వాడుకోవచ్చని, దీనిపై ప్రభుత్వ స్థాయిలో చర్చ జరగాలని భావిస్తున్నారు. అంతేకాకుండా, గ్రౌహౌండ్స్‌కు ఉన్న విలువైన భూమిని ప్రైవేట్‌పరం చేయొద్దని, భవిష్యత్‌లో పోలీసు అవసరాలకు భూమి దొరకడం కష్టమని, దీనిని పోలీసు శాఖకు సంబంధించిన భవిష్యత్ అవసరాలకు ఉపయోగిస్తే మంచిదని, ఇతరత్ర శిక్షణ కార్యక్రమాలను ఇక్కడ నిర్వహించాలని సూచిస్తున్నారు.




రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై కవిత ధ్వజం

# ఆధారాలు బయటపెడితే నన్ను బదనాం చేస్తారా

విజేత, హైద్రాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌పై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రపంచ బ్యాంక్‌కు మూసీ పరివాహక ప్రాంత భూములను కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు.ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో కవిత మీడియాతో మాట్లాడారు. ఇప్పటివరకు మూసీపై కాంగ్రెస్ ప్రభుత్వం డీపీఆర్‌ను ఎందుకు విడుదల చేయట్లేదని ప్రశ్నించారు.ఫేజ్- వన్‌కి సంబంధించిన డీపీఆర్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం చూపెట్టిందని ప్రస్తావించారు. పూర్తి డీపీఆర్ ఇవ్వకపోవడం వెనుక మోసం ఉందని ఆరోపించారు. ప్రీ ఫీజబులిటీ రిపోర్టులో రూ.5,641 కోట్లు ఖర్చు అవుతుందని ఈ ప్రభుత్వం చెప్పిందని గుర్తుచేశారు.

**@– మూసీపై ప్రజెంటేషన్‌కు ఎందుకు పిలవలేదు.**

ఆరు నెలల తర్వాత దాదాపు రూ.1400 కోట్ల అంచనా ఎందుకు పెరిగిందని కవిత నిలదీశారు. జాతిపిత మహాత్మాగాంధీ విగ్రహానికి ఎంత ఖర్చు అవుతుందో.. ఆ ఖర్చు మొత్తం సీఎం రేవంత్‌రెడ్డి ఇంటి నుంచి ఇవ్వాలని డిమాండ్ చేశారు. మూసీ ప్రాజెక్టు ప్రజెంటేషన్‌కు రియల్ ఎస్టేట్ వ్యాపారులు, ప్రపంచ బ్యాంక్ ప్రతినిధులు, మంత్రులను పిలిచారని అన్నారు. కానీ మూసీలో ఇల్లు కోల్పోయిన నిర్వాసితులను ప్రజెంటేషన్‌కు ఎందుకు పిలవలేదని ప్రశ్నల వర్షం కురిపించారు. తెలంగాణలో చిన్న మోదీలా.. రేవంత్‌రెడ్డి వ్యవహారం ఉందని ఎద్దేవా చేశారు. మూసీ పేరుతో సీఎం గ్రాఫిక్స్ చూపెట్టారని సెటైర్లు గుప్పించారు. 16 నాలాల నుంచి మూసీలోకి మురుగు నీరు వస్తోందని చెప్పుకొచ్చారు. నగరంలో ఉన్న వ్యర్థాలన్నీ మూసీలోకి వెళ్తున్నాయని తెలిపారు.

**@– అరాచకం చేస్తున్నారు..**

హైడ్రాతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి అరాచకం చేస్తున్నారని కవిత ఆగ్రహించారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు ఇప్పటివరకు ఆరు ఫిర్యాదులు చేశామని ప్రస్తావించారు. హైడ్రా కమిషనర్, ప్రభుత్వంపై పరువు నష్టం దావా వేస్తానని అన్నారు. నాలాలు ఆక్రమించి విల్లాలు కడుతున్న సంస్థ తమ పరిధిలోకి రాదని హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఎలా చెబుతున్నారని ఫైర్ అయ్యారు. సిగ్గు లేకుండా రంగనాథ్ హైడ్రా వీడియోలు తీసి పెడుతున్నారని ఎద్దేవా చేశారు. ఇష్టం వచ్చినట్లుగా వీడియోలు పెడుతున్నారని.. మీరేమైనా కంటెంట్ రైటర్లా ...? అని ధ్వజమెత్తారు.

**@– కాంగ్రెస్ ప్రభుత్వం బాయిలో దూకాలి..**

తాను ఆధారాలు బయటపెడితే హైడ్రా, కాంగ్రెస్ ప్రభుత్వం బాయిలో దూకాలని కవిత ఎద్దేవా చేశారు. తాను ఆధారాలు బయటపెడితే ఈ ప్రభుత్వం, ప్రతిపక్షం కలిసి తనను బదనాం చేస్తారా...?, తమాషాలు చేస్తున్నారా..? అని ఆగ్రహించారు. హైడ్రా పెట్టిన ట్వీట్స్ వెంటనే డిలీట్ చేయాలని.. లేకపోతే పరువు నష్టం దావా వేస్తానని హెచ్చరించారు. తెలంగాణలో రియల్ ఎస్టేట్ ప్రభుత్వం నడుస్తోందని ఆరోపించారు. ఖమ్మం జిల్లాలోని వెలుగుమట్లలో అసలైన బాధితులకు ఇళ్ల పట్టాలను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నల వర్షం కురిపించారు. అందులో కొంతమంది కాంగ్రెస్ కార్యకర్తలకు ఇచ్చారనే విషయం తమ దృష్టికి వచ్చిందని అన్నారు. త్వరలో వెలుగుమట్లలో పర్యటిస్తానని కవిత స్పష్టం చేశారు.

Printed, published and owned by DR.B.ANIL KUMAR,@ 407 THARNAKA, HYDERABAD, Telangana state published at DAIWIK PUBLICATION Pvt.ltd.printed at SNEHITHA PRINTERS H-NO :2-6 , warangal dist.tg state. EDITOR DR.B.ANIL KUMAR,RNI NO TELTEL/2021/81979,Cell 7702866885,vijethateluguda ily@gmail.com